
మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

గంగాధర సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్


గంగాధర సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ నూర్ ఖాన్

గంగాధర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంగాధర సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ నూర్ఖాన్‌ను సస్పెండ్ చేస్తూ కరీంనగర్ డీఐజీ రవీందర్ ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని కొత్తపల్లి మండలంలోని సర్వే నంబర్ 272లోని లావాణి పట్టా 20 గుంటల భూమిని తొమ్మిది మందికి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారు. విచారణ జరిపిన జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రవీందర్ గంగాధర సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సదాశివకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నేడు నాగుల పంచమి


శ్రీపురం కాలనీలోని పాముపుట్ట

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో వచ్చే నాగుల పంచమిని మంగళవారం నిర్వహించనున్నారు. పుట్టలున్న శైవ, వైష్ణవాలయాల్లో భక్తులు పాల్గొని పాలు పోయనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. భక్తులు పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి, ఆవు పాలు, నెయ్యితో కలిపిన నువ్వులు, బియ్యపు ముద్దలను నైవేద్యంగా పెట్టి వెండితో పాము చెవులు, కండ్లు, పడిగె లాంటి అవయవాలు చేసి పుట్టలో వేస్తారు. సర్పసూక్తం, అనంత నాగేంద్రస్తుతి, సుబ్రహ్మణ్యేశ్వర స్తుతులతో అభిషేక అర్చనలు చేస్తారు. ఉపవాసాలు పాటించి పుట్టమట్టిని బంగారంగా భావించి తిలక ధారణ చేసుకుంటారు.



తీరనున్న కష్టాలు

కరీంనగర్-జగిత్యాల రోడ్డుకు త్వరలో మోక్షం

- ప్రారంభం కానున్న విస్తరణ పనులు
- హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా కేంద్రమైన కరీంనగర్ నుంచి జగిత్యాలకు ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రస్తుతమున్న డబుల్ రోడ్డుతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 50 కిలో మీటర్ల దూరం వెళ్లాలంటే కనీసం గంటన్నర సమయం పడుతుంది. ప్రభుత్వం దీనిని నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించాలని నిర్ణయించింది. కేంద్రం ఇందుకు నిధులు కేటాయించింది. రోడ్డుకు ఇరువైపులా మండల కేంద్రాలు ఉండడం, రోడ్డు పక్కనే గ్రామాలు వెలిసి వ్యాపార కేంద్రాలుగా మారడంతో విలువైన ఆ స్థలాలను వదులుకోవడానికి ప్రజలు అంగీకరించలేదు. దీంతో రోడ్డు విస్తరణ పెండింగ్‌లో పడుతూ వస్తున్నది. చివరకు ప్రభుత్వం దీనిని గ్రీన్ ఫీల్డ్ రోడ్డుగా మార్చి పెద్ద గ్రామాలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పొలాల మీదుగా రోడ్డు అలైన్‌మెంట్ మార్చింది. అక్కడక్కడ ఏర్పడిన ఇబ్బందులను తొలగించేందుకు బైపాస్‌లను ప్రతిపాదించింది. అయినా ఆ రోడ్డు విస్తరణ ఇంకా ప్రారంభం కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నట్లు తెలుస్తున్నది.

● తొలగిన అడ్డంకులు

కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్-జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించేందుకు కేంద్రం ఇదివరకే 2,151.35 కోట్ల రూపా య లతో అంచనాలు రూపొందించారు. అందుకు నిధులు విడుదల చేసేం

(మిగతా 8వపేజీలో)


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కానిస్టేబుళ్లు టెక్నాలజీపై
పట్టు సాధించాలి

కరీంనగర్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లకు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి టెక్నాలజీపై పట్టు సాధించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ కమీషనరేట్ పరిధిలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో బ్యాచ్ శిక్షణను సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో పోలీసులు ఉపయోగించే వివిధ సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్‌లు, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ ఉంటుందని వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు జి విజయ కుమార్, వేణుగోపాల్, సీఐ తిరుపతి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల
వాడకం తగ్గేనా?

- హోటళ్లు, దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం

7

కుంగిన రాజీవ్ రహదారి

- ఎల్ఎండీ వద్ద భారీ గుంత
- వర్షాలతో దెబ్బతిన్న రహదారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

తిమ్మాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై మండలంలోని ఎల్ఎండి కాలనీ వద్ద సోమవారం మధ్యాహ్నం భారీ గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురి అయ్యారు. ఓ భారీ వాహనం అక్కడి నుంచి వెళ్లిన కొద్దిసేపటికే ఒక్కసారిగా గుంత ఏర్పడింది. గమనించిన ప్రయాణికులు వాహనాలు అటుగా రాకుండా గుంతలో చెట్ల కొమ్మలను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ అధికారులు, సిబ్బంది ఆ స్థలానికి వచ్చి గుంత ఎలా, ఎందుకు పడింది అని పరిశీలించారు. గుంతలో ఇసుక నింపారు. రాత్రి సమయంలో గుంత పడి ప్రమాదాలు జరిగి ఉండేవి. రాజీవ్ రహదారిపై అలుగునూర్ నుంచి రేణికుంట హెచ్‌కేఆర్ టోల్‌గేట్ వరకు పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బంది పడుతున్నారు. గుంత పడడంపై హెచ్‌కేఆర్ డీజీఎం విజయ్ భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా గతంలో రోడ్డు కింది భాగంలో వేసిన పైపులు దెబ్బతిని గుంతలు ఏర్పడతాయని, ఇలాంటివి సహజమన్నారు. రెండు మూడు రోజుల్లో రాజీవ్ రహదారిపై పడిన గుంతలను పూడ్చేస్తామని విజయ్‌భాస్కర్ రెడ్డి తెలిపారు.


ఎల్ఎండీ కాలనీ వద్ద రాజీవ్ రహదారిపై పడిన గుంత


రాజీవ్ రహదారిపై గుంతను పూడ్చుతున్న హెచ్‌కేఆర్ సిబ్బంది


రాజీవ్ రహదారిపై గుంతలు

వర్షపు నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షపు నీరు నిలువకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగరంలో పర్యటించి ఇటీవల వరద నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, డ్రైనేజీలో చెత్త చెదారంతోపాటు పేరుకుపోయిన సిల్టు తొలగించాలన్నారు. నగరపాలక సంస్థ, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయంతో వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏసీపీ శ్రీధర్, డీఆర్ఎఫ్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


నగరంలో పర్యటిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్

● ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గంగాధర: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపడుతూ క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నా రు. గంగాధరలో ఎరువుల దుకాణం, ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణంలో కొనుగోళ్ల రిజిస్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దుకాణాల వారీగా నిఘా ఉంచాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇంటింటి ఆరోగ్య సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని రకాల మందులను స్టాక్ ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాధికారి భాగ్యలక్ష్మీ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, వైద్యాధికారి శ్వేత పాల్గొన్నారు.

ప్రజావాణికి 328 దరఖాస్తులు

సుభాష్‌నగర్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 328 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ అశ్విని తనాజి వాఖడే తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడి టోరియంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఆమె దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, కరీంనగర్ ఆర్‌డీవో మహేశ్వర్, హుజురాబాద్ ఆర్‌డీవో రమేశ్ పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అశ్విని తనాజి వాఖడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

● నష్టపరిహారం ఇప్పించండి..

బ్రిడ్జి నిర్మాణంలో తమ వ్యవసాయ భూమిని కోల్పోయామని, దానికి సంబం దించిన నష్టపరిహారం ఇప్పించాలని నిర్వాసిత రైతులు అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం ప్రజా వాణిలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామడుగు నుంచి కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా రామడుగు, షానగర్ గ్రామాల మధ్యలో మోతె వాగుపై ప్రభుత్వం వంతెన నిర్మించిందన్నారు. వంతెన నిర్మాణంలో తమ వ్యవసాయ భూమి, కోళ్ల ఫారం కోల్పోయామని తెలిపారు. అందుకు సంబంధించిన నష్టపరిహారం ఇప్పటివరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేవారు. నష్టపరిహారం కోసం ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరిగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న నిర్వాసిత రైతులు

● న్యాయం చేయండి..

తనకు న్యాయం చేయాల్సిన తహసీల్దార్ అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని గంగాధర శాంతమ్మ ఆరోపించారు. సోమవారం ప్రజావాణిలో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన తాము మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఎండి గౌస్ అనేవ్యక్తి నుంచి సర్వే నంబరు 94లో 34 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని తనపేరుపై రిజిస్ట్రేషన్ చేసుకుని, ఖాస్తుకు ఉంటున్నామని తెలిపారు. ఆస్థలంలో ఎండి నజీర్ అనేవ్యక్తి తన అనుచరులతో అక్రమంగా షెడ్డు వేసి ప్రహరీ నిర్మించారన్నారు. ఈ విషయం తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా తమకు న్యాయం చేయాల్సిందిపోయి వారికే వత్తాసు పలుకుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిర్వీర్యం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి విష్ణు

జమ్మికుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు విమర్శించారు. సోమవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. మద్యానికి మంత్రిని నియమించి చదువులకు మాత్రం మంత్రిని నియమించక పోవడం సిగ్గు చేటన్నారు. చదువులకు నిధులు లేవు కాని హెలిక్యాప్టర్లల్లో మంత్రులు తిరుగడానికి నిధులు ఎలా వస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని ఎవరినీ కలవకుండా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వారం రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అభిలాష్, నవీన్, కుమార్, రాజు పాల్గొన్నారు.

జాతీయ కార్యశాలలో కలెక్టర్


జాతీయ కార్యశాలలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ కార్యశాలలో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. పారిశుధ్య పనుల్లో భద్రత, రక్షణ, పారిశుధ్య కార్మికుల గౌరవం పెంచేందుకు ఇతర రాష్ట్రాలు, సంస్థలు చేస్తున్న ప్రయత్నాలను ఈ కార్యశాలలో చర్చించారు. కలెక్టర్ పలమేలా సత్పతి పారిశుధ్య కార్మికుల భద్రతకు కరీంనగర్‌లో తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో యూనిసెఫ్ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్మికుల భద్రత చర్యల గురించి తెలిపారు.

అప్పుల బాధతో ఉరి వేసుకొని

ఒకరి బలవన్మరణం



చంద్రయ్య(ఫైల్)

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పబ్బతి చంద్రయ్య (40) అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం. చంద్రయ్య ఉపాధి నిమిత్తం 5నెలల క్రితం సౌదీకెనకు వెళ్లి జీవిలేక స్వగ్రామానికి వచ్చాడు. అప్పటికే విదేశాలకు వెళ్లేందుకుచేసిన అప్పులతో పాటు తిరిగి వచ్చాక మరిన్ని అప్పులు చేశాడు. దీంతో సుమారు 4లక్షల వరకు అప్పు ఉండ డంతో అధికీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న జామచెట్టుకు ఉరివేసు కుని మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు చంద్రయ్య భార్య పబ్బతి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమెరికాలో సింగరేణి ఉద్యోగి మృతి



ప్రకాష్(ఫైల్)

గోదావరిఖని, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెరుక ప్రకాష్(53) అమెరికాలో శనివారం గుండె పోటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న ప్రకాష్ రెండు నెలల క్రితం అమెరికా టెక్సాస్ స్టేట్ ఆస్టిన్‌లో కూతురు వద్దకు వెళ్లాడు. మరికొద్దిరోజుల్లో ఇండియాకు తిరిగివచ్చే సమయంలోనే శనివారంరోజు ఆయన గుండెపోటుకు గురయ్యాడు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ ప్రకాష్ ఆదివారం మృతిచెందాడు. అతడి పార్థివదేహాన్ని గోదావరిఖనికి తీసుకువచ్చేందుకు బంధుమిత్రులు ప్రయత్నాలు చేస్తున్నారు.

నీటి బకెట్‌లో పడి బాలిక దుర్మరణం



మృతిచెందిన బాలిక

జూలపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీష్ కూతురు సాన్వీ (19నెలలు) చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న బకెట్‌లో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు పోలీసులు అందించిన సమాచారం మేరకు గుండు సతీష్, రవళి దంపతుల కూతురు సాన్వీ ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలోఉన్న నీటి బకెట్‌లో ప్రమాదవశాత్తు పడి కొట్టుమిట్టాడుతుండగా గమనించిన తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుప త్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి మృతిపై తమకు ఎవరిపై అనుమానం లేదని తండ్రి పోలీసు లకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన వేముల మధు అనే రైతు తన పశువులను గ్రామ శివారులోని తన పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. అదే రాత్రి చిరుత దాడిచేసి చంపివేసింది. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుత దాడిలోనే దూడ మృతి చెందినట్లు గుర్తించారు. చిరుత సంచారంతో పొలాల వద్దకు వెళ్లేందుకు అటవీప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులో అనుమతి లేకుండా పేలుళ్లకు పాల్పడు తున్న వ్యక్తులపై సోమవారం దాడి చేశామని పోలీసులు తెలిపారు. కంప్రెసర్ వాహనంతోపాటు జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

సాహిత్య మహారాజు సినారె




సిరిసిల్లలోని సినారె స్మారక గ్రంథాలయం

- హన్మాజిపేట నుంచి..జ్ఞానపీఠం వరకు
- అక్షరానికి మాటలు...పాటల చెలికాడు
- విశ్వంభరుడి జ్ఞాపకాల్లో సాహిత్య కారులు
- నేడు మహాకవి సి నారాయణరెడ్డి జయంతి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పాట, మాట నా రెండు కళ్లు అన్నాడు.. మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి. మాటకు దండం పెడతా.. పాటకూ దండంపెడతా... మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా అంటూ సినారె అడుగు లువేసిన మానేరు ఇసుక తిన్నెలు... మూలవాగు సవ్వడులు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. జూలై 29 మహాకవి డాక్టర్ సి నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాల మదిలోకి వెళ్తే..

సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజి పేట గ్రామంలో జూలై 29, 1931లో సినారె ఊపిరి పోసుకున్నారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు సినారె. కుటుంబ వరంగా భూస్వామ్య వారసత్వమైన ఆ మనస్తత్వం ఇంట్లో ఎవరికీ లేదు. తండ్రి స్వయంగా తానే నాగలి పట్టి దున్నే వాడు. సినారె మూడో తర



గతి వరకు ఊళ్లోనే చదువుకున్నా నాలుగో తరగతికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకు చేరుకున్నారు. పొరుగూరికి పంపించి చదివించడం తల్లి బుచ్చమ్మకు ఇష్టం లేక పోయినా తండ్రి మల్లారెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు.

'ఊపిరాడలేదు.. ఉక్కపోస్తుంది. ఏసీ గదిలో.. కారణం తెలిసి పోయింది. కవిత రయలేదు ఇవాళ.. రాస్తూ రాస్తూ పోతాను... సిర ఇంకిపోయే వరకు అంటూ సినారె తనకు 86 ఏళ్ల పూర్తవుతున్న సమ యంలో 2017 జూన్ 12న కన్నుమూశారు.

సినారె సిరిసిల్ల మానేరు తీరాన ప్రాథమిక విద్యను కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించి పైచదువులకు హైదరాబాద్ చేరుకున్నారు. హైదరా బాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియేట్, ఉస్మానియాలో బీఏ ఉర్దూ మీడియంలోనే పూర్తి చేశా రు. ఉస్మానియా విశ్వవిద్యా లయం నుంచే తెలుగు సాహిత్యంలో పోస్టు గ్రాడ్యు యేట్, డాక్టరేట్ పొందారు. శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయంలో అనేక గ్రంథాలను చదివారు.

తొలి రచన సిరిసిల్లలో ఆవిష్కరణ

బాల్యంనుంచే పద్యాలు, పాటలు, కవిత్వాన్ని రాసే సి. నారాయణరెడ్డి కళాశాల విద్యార్థిగానే శోభ పత్రి కకు సంపాదకత్వం వహించారు. రేడియో, సింహేంద్ర పేరుతో కవితలను రాసేవారు. సినారె కవిత తొలి సారిగా జనశక్తి పత్రికలో అచ్చయింది. 1953లో నవ్వని పువ్వు సంగీత నృత్యనాటికను ప్రచురించారు. అది సిరిసిల్ల టౌన్‌హాల్‌లో ఆవిష్కరించారు. అక్కడి నుంచి ఎన్నో కవితా సంపుటాలను వెలువరించారు.

ఎన్నెన్నో పురస్కారాలు

సినారె అందుకున్న అవార్డులు ఎన్నో ఉన్నాయి. 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, మోహినిదన్ కోమారన్, 1988లో అత్యున్నత జ్ఞానపీఠ అవార్డు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పుర స్కారం, ఉత్తమ పాటల రచయితగా నంది పురస్కారం, గౌర వ డాక్టరేట్లను పొందారు. 95కిపైగా పుస్తకాలు రాయ గా, సినిమాలకు 3,500లకుపైగా పాటలు రాశారు. హిందీ, ఉర్దూ బాషాల్లో కూడా కవితలు రాశారు.

అజేయుడు సినారె : జూకంటి జగన్నాథం,అధ్యక్షుడు, తెలంగాణ అఖిల భారత రచయితల సంఘం



సినారె అజేయుడు, చిరంజీవి. తెలుగు కవిత్వం ఉన్నంత వరకు సినారె అనే మూడు అక్షరాలు శిలాక్షరాలుగా నిలుస్తాయి. మారుమూల హనుమాజీపేట గ్రామంలో రైతు బిడ్డగా పుట్టిన సి నారా యణరెడ్డి దేశంలోని అత్యున్నత పురస్కారాలెన్నో పొందారు. సినిమా పాటలు రాసిన, యూనివ ర్సిటీలో పాఠాలు బోధించినా , రాజ్యసభలో తెలుగు భాషపై గలమెత్తిన నిండు నిజాయితీగల తెలుగు రైతు కవిగా ప్రశ్నించేవారు.

తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత



సినారె కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక ప్రవాహం. ఆయన కవిత్వం ప్రేమను, మానవతను, తాత్వికతను అక్షరాలలో నింపి ఒకవైపు సంగీతమయంగానూ, మరోవైపు లయాత్మకంగానూ ఉంటుం ది. తన విశ్వంభర వంటి దీర్ఘ కవితల్లో ప్రపంచాన్ని మానవ జీవితాన్ని తాత్వికంగా స్పృశించిన తత్వవేత్తగా కనిపిస్తారు. సినిమా పాటల్లో సులభతరమైన, అందరికి చేరగలిగే భావాన్ని ఆయన పొందుపరిచారు.

పశువుల కాపరి పైకి దూసుకెళ్లిన కారు

- తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామా రెడ్డి- సిరిసిల్ల ప్రధానరహదారిపై కారు సోమవారం అదుపుతప్పి పశువుల కాప రిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మండలంలోని రాగట్లపల్లికి చెందిన కారపు నవీన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగా త్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవీన్ తన పశు వులను రోడ్డు పక్కన మేపుతున్నాడు. సిరి సిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళు తున్న కారు అదుపుతప్పి నవీన్‌పైకి దూసు కెళ్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరు పుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమ వారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 15క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి పట్టివేత

వెల్గటూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీచేస్తుండగా ఓ యువకుడి వద్ద 110గ్రాముల గంజాయి దొరికినట్లు ఎస్సై ఆర్ ఉమాసాగర్ తెలి పారు. గంజాయితో పట్టుబడ్డ ఓ యువ కుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ముక్కట్రావుపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువ కుడు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి దొరికినట్లు పేర్కొన్నారు. ఆ యువకుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

- చీమలకుంటపల్లి, లలితాపూర్‌లలో దొంగల బీభత్సం
- బంగారం, వెండిని ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో దొంగలు తాళంవేసిన ఓ ఇంటిలో చొరబడి బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన ఎండీ రహీం భార్య అమీనాబేగం తన ఇంటికి తాళం వేసి రెండురోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో దొంగలు ఇంటితాళం పగులగొట్టి 25తులాల వెండి, తులం బంగారం ఎత్తుకెళ్లి పోయారు. సోమవారం అమీనాబేగం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటితాళాలు, బీరువా పగుల గొట్టి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందిం చారు. ఎస్సై నరేందర్‌రెడ్డి సిబ్బందితో చేరు కొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తాళంవేసిన ఇళ్లలోచోరీలు జరుగుతుండడం తో గ్రామస్తులు భయబ్రాంతులకు గురవు తున్నారు. పోలీసులు ప్రత్యేకనిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లలితాపూర్‌లో ..

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామంలో పొలవేణి రాజ య్య ఇంటిలో గుర్తుతెలియ ని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెం దిన రాజయ్య, ఆతని భార్య సుగుణ దంపతులు ఆదివా రం ఇంటికి తాళంవేసి వన వోలు గ్రామంలో ఉండే వారి కూతురు ఇంటిలో పోచమ్మ పండుగకు వెళ్లారు. ఆదివారం రా త్రి గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటితా ళాలు పగుల బీరువాలో తులంన్నర బం గారు నగలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లా రు. సోమవారం గ్రామానికి వచ్చిన దంప తులు ఇంటితలుపుల తాళాలు పగులకొట్టి ఉండడా న్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీ రువాలోని బంగారు నగలు లేకపోవడంతో లబోదిబోమంటూ విలపించారు. పోలీసుల కు సమాచారం అందించడంతో వారు సం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరి గిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.



చీమలకుంటపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్ రెడ్డి

ఏడుగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎవరికీ తెలియకుండా మెట్‌పల్లి క్లబ్ ఆస్తు లను, భూములను విక్రయించారని ఫిర్యాదు మేరకు ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న క్లబ్‌ను అక్రమంగా విక్రయించారని పట్టణానికి చెందిన దొంతుల వెంకటేశ్వర్‌రావు ఆది వారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చెట్లపల్లి సరేందర్‌గౌడ్, గంగుల వివేక్, వేముల కిషన్, దొంతుల సుధాకర్, వేము గంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

- ఒకే రోజు రెండు డివిజన్ బెంచీలపై 100కు పైగా కేసులు స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, ఆస్తి తగా దాలు, లైంగిక దాడులు తదితర మానవహక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులపై జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) హైదరాబాద్‌లో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని డివిజన్ బెంచ్-1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్‌రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోనివసతులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కస్టోడియల్ పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యా దులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది.

పాడి పరిశ్రమతో అదనపు ఆదాయం

- ఈ ఏడాది రూ.15కోట్ల బోనస్‌ను అందజేస్తాం
- ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమతో మహిళలు అదనపు ఆదాయం పొందాలని ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మహిళా డెయిరీలో 23వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం వచ్చిన లాభాల్లో రూ.15కోట్ల బోనస్ మహిళా రైతులకు సద్దుల బతుకమ్మ సందర్భంగా అందజేస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో మహిళలు పాడి పరిశ్రమ వైపు దృష్టిసారించి అదనపు ఆదాయం పొందాలన్నారు.

అనంతరం ముల్కనూర్ డెయిరీ జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు డెయిరీకి 48వేల లీటర్ల ఆవు పాలు, 20వేల లీటర్ల గేదె పాలు వస్తున్నాయన్నారు. ఈ సంవత్సరం సభ్యులకు రూ. 1.05కోట్లు సంక్షేమ పథకాలకు నిధులు పెంపు చేశామన్నారు. అంతకుముందు వార్షిక నివేదికను ఆడిట్ మేనేజర్ అజయ్ సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జంగా రాజేశ్వరి, నల్లాల సులోచన, పింగిలి రజిత, దొంతరవేణి రజిత, మామిడాల శోభారాణి, కర్ర రమాదేవి, కట్కూరి కవిత, పెద్దబోన అరుణ, గుండెల్లి రజిత, పొన్నం సుజాత, గుర్రాల సుజాతలతోపాటు వివిధ గ్రామాలకు చెందిన అధ్యక్షులు పాల్గొన్నారు.

మూడు వాహనాలను ఢీకొట్టిన కారు

సిరిసిల్ల క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి మూడువాహనాలను ఢీకొట్టింది. ఈ సంఘ టనలో వాహనాలలో ఎవరూ లేకపోవడం తో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వైపునకు వస్తున్న కారు అతివేగంగా వెళ్తూ పార్కింగ్‌లో ఉన్న రెండు కార్లకు ఢీకొని ఎదురుగా ఉన్న ఓ ఫ్రైవేటు బస్సుకు ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కాగా కారు నుజ్జునుజ్జయింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగు నూర్ శివారు వాగునుంచి అనుమతి లేకుం డా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమ వారం పట్టుకున్నట్లు రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బీమహేష్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పండ్ల తోటల్లో లౌడ్ స్పీకర్లు

- పక్షుల బెడదకు రైతుల పాట్లు
- చిన్న ఆలోచనతో చక్కని పరిష్కారం
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏడు గంటల వరకు శబ్దాలు



తాను ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్‌తో రైతు రవీందర్‌రావు

గంగాధర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పంటలను పక్షులు, జంతువుల బారి కాపాడుకునేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచన చేశాడు. గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో కరీంనగర్‌కు చెందిన రైతు రవీందర్‌రావు 6ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడసాగుకు నీరు తక్కువగా ఉండ డంతో ఆయన 13రకాల పండ్లచెట్లను నాటాడు. ప్రస్తుతం ఆయనకు జామపళ్ల రోజుకు రెండు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పక్షులు, జంతువులు పండ్లను తింటూ తీవ్రనష్టం చేస్తున్నాయి. కూలీలను పెట్టి పక్షు లను తరిమేయాల్సి వస్తుండగా ఆదనపు భారం పడు తోంది. దీంతో ఆయన పక్షుల బెడద నివారణకు మైక్‌ను ఏర్పాటు చేశాడు. దానిలో పక్షులు, జంతువులు భయప డేలా వివిధ రకాల సౌండ్స్ రికార్డు చేయించాడు. తోట చుట్టూ మూడు మైక్‌లను పెట్టి సౌండ్ చేయిస్తున్నాడు. దీంతో ఆసౌండ్ విన్న పక్షులు భయంతో చెట్ల పైనుంచి ఎగిరిపోతున్నాయి. గంగాధర బ్లాక్‌లోని స్వామి అనే రైతు తనకున్న మామిడి తోటను కోతులు, పక్షుల నుంచి కాపాడుకోవడానికి ఏడు మైక్‌లను ఏర్పాటు చేశాడు. గంగాధర, కొండన్నపల్లిలో రైతులు ఉపయోగిస్తున్న సౌండ్‌తో పక్షులు, కోతులు, ముంగిసలు, పిల్లులు పారి పోతుండగా మండలంలోని పలుగ్రామాల రైతులు వంట పొలాల్లో ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని గుడిసెలో పేకాట ఆడు తున్నారనే సమాచారంతో దాడిచేశామని ఎస్ఐ మోతీరాం సోమవారం తెలిపారు. పేకాట ఆడుతున్న 8మంది వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, 6ద్విచక్రవాహనాలు, పేకా ముక్కలు, రూ.4630 నగదును స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. పేకాటరాయుళ్లను పోలీస్‌స్టేష న్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

శ్రీరాములపల్లెలో..

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కథనం ప్రకారం పక్కా సమాచారం మేర కు గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడు లు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.7,380 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా కరీంనగర్

- జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో రాష్ట్రస్థాయి క్రీడలకు కరీంనగర్ వేదికగా నిలు స్తోందని ఉమ్మడిజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవిస్కూల్, పీజీకళాశాలలో 3వ తెలం గాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూకరాటే పోటీల బ్రోచర్‌ను కళా శాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, పాఠశాల డైరెక్టర్ గోపు సుశాంత్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలను సెప్టెంబరులో కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించనుం డడం అభినందనీయమన్నారు. పోటీలనిర్వాహకుడు ఎలి గందుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు ఉచితభోజన, వసతి సౌక ర్యాలు కల్పించనున్నామన్నారు. ఆల్‌స్టైల్ కుంగ్‌ఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు సెరెళ్ల శ్రీధర్‌గౌడ్, బొద్దు రాజులు, ఉపాధ్యక్షుడు రాజేందర్, సంయుక్త కార్యదర్శి మద్ది శ్రీనివాస్, మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉమ్మడిజిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి

ఖేలో ఇండియా పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగా లలో సత్తాచాటారు. హైదరాబాద్ ఎల్బీస్టేడియం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఖేల్ ఇండియా సిటీ ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నుండి ఎంపిక మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైట్ విభాగం లైట్ కాంటాక్ట్ జూనియర్ విభాగంలో గంగ వేణి ప్రవళిక, చిల్డ్రన్ పాయింట్ ఫైట్ విభాగంలో ఎల్లె ప్రణవి, గజ్జెల హిరణ్మయి, కేడెట్ పాయింట్ ఫైట్ విభాగంలో గజ్జెల శ్వేదిక, కర్ని యుతిక బంగారు పతకా లను సాధించారు. కిక్ బాక్సింగ్‌లో లక్ష్మి ప్రసన్న, ప్రణవి, హిరణ్మయి, శ్వేదిక రజత పతకాలను సాధించారు. కంచర్ల శ్రీనిక లింగం శ్లోక, లక్ష్మీప్రసన్నలు కాంస్య పతకాలను సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను తెలంగాణ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ పతకాలను, ప్రశంసా పతకాలను అందించి అభినందించారు.

జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వొద్దెల శ్రీనివాస్, కోచ్ యెనగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ బంగారు పతకాలు సాధించిన చిన్నారులు కిక్ బాక్సింగ్ సౌత్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఖేలో ఇండియా సిటీ ఉమెన్స్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన కందుకూరి కవిత బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. వుషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వర్గం రవితేజ, కార్యదర్శి విశ్వ అఖిలవాణి, కోచ్ జావిద్‌ఖాన్ లహరిని అభినందించారు.



పతకాలను సాధించిన చిన్నారులతో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు



పాండవ లంకలో జలపాతం

జలపాతాలకు సందర్శకుల తాకిడి

- పచ్చదనం అల్లుకున్న గట్టు సింగారం
- అహ్లాదకరంగా పాండవ లొంక జలపాతం
- కనువిందు చేస్తున్న గాడుదులగండి గుట్ట

పెద్దపల్లి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సబ్బితం జలపాతానికి సందర్శకుల తాకిడి పెరిగింది. పూర్వకాలంలో ఏర్పడిన ఈ జలపాతం కొన్నేళ్ల వరకు గ్రామస్థులకు మాత్రమే తెలిసేది. 8 ఏళ్లుగా జలపాతం వద్దకు సందర్శకుల తాకిడి పెరిగింది. గట్టుసింగారం గుట్టపై సీతమ్మలోరి లొద్ది అనే ప్రాంతానికి శ్రీరాముడు వనవాసంలో భాగంగా వచ్చినట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఆ సమయంలో జలపాతం వద్ద నీటిని సేవించాడని పేర్కొంటున్నారు. గట్టుసింగారం గుట్టపైన మామిడికుంట, మిడి చెరువు, చొక్కన్న కుంటలు ఉన్నాయి. వర్షాలతో నిండి బండరాళ్ల ద్వారా జలధారగా వస్తోంది. ఆ జలధారనే గౌరిగుండాల జలపాతంగా మారినట్లు ప్రచారంలో సాగుతోంది. పురాతన కాలంలో గుండం వద్ద గౌరీ మాత అనే దేవత కొలుపై స్నానాలు ఆచరించడంతో గౌరి గుండాల జలపాతంగా పేరు వచ్చిందని పూర్వీకులు తెలుపుతున్నారు.



సబ్బితం జలపాతం

పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి మంథని వెళ్ళే దారిలో సబ్బితం వరకు 10 కి.మీ. దూరం ఉంది. అక్కడి నుంచి 3 కి.మీ. దూరంలో జలపాతం ఉంటుంది. జలపాతం సమీపం వరకు ద్విచక్ర వాహనాలు వెళ్తాయి. సబ్బితం నుంచి గౌరి గుండాల జలపాతం వద్దకు చేరుకోవాలంటే సుమారు 3 కి.మీ. మట్టి రోడ్డు ఉంటుంది. వర్షాలు కురిస్తే రోడ్డంతా బురద మయంగా ఇబ్బందికరంగా ఉంటుంది. జలధార వానాకాలంలో మాత్రమే ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. జలపాతానికి కిలోమీటర్ దూరం నుంచే వాహనాలు నిలిపి కాలినడకగా వెళ్లాల్సిన ఉంటుంది.

జలపాతం వద్ద పురాతన విగ్రహాలు

జలపాతం వద్ద రాయిని తొలచి చిన్న గుడి ఉంది. ఇందులో శివ లింగం ఉంటుంది. దాని పక్కనే ఓ బండరాయిపై నాగదేవత, ఇతర రూపాలు చెక్కి ఉన్నాయి. విగ్రహంలో శివలింగం, గణపతి, గోళ్లభామలు, గుట్టపై బయ్యన్న విగ్రహాలున్నాయి. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు శ్రావణ మాసం లో జలపాతం వద్దకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు.

జలపాతం వద్ద పోలీస్ పికెట్

జలపాతం వద్ద పెద్దపల్లి రూరల్ పోలీసులు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. జలపాతానికి వచ్చేందుకు ఎవరికి అనుమతి లేదని భారీ గేడ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన సంఘటనలు, జలపాతం వద్ద మృతిచెందిన వారి ఫొటోలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం వద్ద పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా యువకులు మద్యం సేవిస్తూ పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

జలపాతానికి రూ. 6 కోట్లు నిధులు కేటాయింపు

సబ్బితం జలపాతం అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు చొరవతో రూ. 6 కోట్ల నిధులు విడుదల చేశారు. జలపాతం వెళ్ళేందుకు రోడ్లు, జలపాతం వద్ద సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ప్రకృతి అందాల మధ్య పాండవ లొంక జలపాతం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్ పేట శివారులో కొండపై ఉన్న పాండవ లొంక జలపాతం వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. రామగిరి కొండలపై పడ్డ వర్షపు నీరు ప్రవహించి పాండవలొంక నుంచి కిందికి జలపాతంగా వస్తున్నది. ఈ పాండవ లొంక ప్రాంతం వరకు సరైన దారి, సౌకర్యం లేకపోవడంతో జాఫర్‌ఖాన్‌పేట హనుమాన్ ఆలయం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పాండవ లొంక ప్రాంతం ఉంటుంది. ఎత్తైన బండరాళ్లు ఉండటంతో ఈ ప్రాంతానికి నడిచి వెళ్ళాలి. వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట నుంచి ఈప్రాంతానికి రావడానికి వీలున్నా సరైన రహదారి లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాండవ లొంక జలపాతాన్ని సందర్శించి, అక్కడ జలపాతంలో సేద తీరుతూ ప్రకృతిని ఆస్వాదిస్తుంటారు. దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ ప్రాంతం అడవులతో నిండి పచ్చని చెట్లతో పాండవులబొమ్మలు, అంజనేయస్వామి విగ్రహం, తదితర దేవతా మూర్తులు ఉన్నాయి. శ్రావణమాసంలో తీర్థాలకు, సహపంక్తి భోజనాలకు గ్రామస్థులు ఇక్కడికి వస్తారు. రామగిరి, ఓదెల, ముత్తారం తదితర మండలాలకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు ఈ జలపాత సందర్శనకు వస్తారు.

గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సందడి

మంథనిరూరల్: మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలోని గాడుదులగండి గుట్ట జలపాతం వద్ద సోమవారం యువత సందడి చేసింది. వారం రోజులుగా కురుసిన వర్షాలకు గుట్టపై అటవీ ప్రాంతంలో నిలిచిన బండల మీదుగా కిందకు నీరు వస్తోంది. మంథని చుట్టు పక్కల యువతతోపాటు కొయ్యూరు, కాటారం, భూపాలపల్లి వెళ్లే ప్రయాణికులు జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జలపాతం వద్దకు వెళ్లడానికి సరైన దారి లేక ఇబ్బందులు పడ్డారు.



జలపాతం సందర్శనకు అనుమతి లేదు
మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



సబ్బితం జలపాతం వద్ద ఇప్పటివరకు సందర్శనకు వచ్చి ఆరుగురు యువకులు మృతిచెందారు. జలపాతం వద్దకు ఎవరికి అనుమతి లేదు. సందర్శకులు, పర్యాటకులు సహకరించాలి. అలాంటి సంఘటనలు జరగకుండా సందర్శనను నిలిపివేశాం.

200 ఏళ్లనాటి జలపాతం
నూనె రాజయ్య, సబ్బితం గ్రామస్థుడు



నిజాం కాలంలో నవాబ్‌లు జలపాతం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గట్టుసింగారం, సబ్బితం గ్రామ ప్రజలు యేటా నిర్వహించే ఉత్సవాలకు వెళ్తారు. అక్కడ ఉన్న దేవుళ్లకు మొక్కితే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం
ఆకుల మల్లమ్మ, సబ్బితం గ్రామస్థురాలు



చిన్నప్పుడు తునికాకు కోసం గుట్టకు వెళ్లేవాళ్లం. జలపాతం నీటితో దాహం తీర్చుకునేవాళ్లం. గతంలో జలపాతం వద్ద పెద్ద జాతర కొనసాగేది. గుట్ట మీద పంట పొలాలు సాగు చేస్తే కూలీకి వెళ్లాం. ప్రస్తుతం మా తాతల భూమి అక్కడే ఉంది.

కిసాన్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్
71 వాహనాలు స్వాధీనం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో త్రీ టౌన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పలు అంశాలపై తనిఖీలు చేపట్టారు. పాత నేరస్థులు ఎవరైనా అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అనే కోణంలో ఆరాతీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 64 ద్విచక్రవాహనాలు, ఐదు ఆటోలు, ఒక ట్రాలీ ఆటో, ఒక కారు ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే గంట లోపల టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : సీపీ

చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ అనంతరం స్థానికులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ద్వారా కిసాన్‌నగర్‌లో శాంతి భద్రతలను పటిష్టం చేయడంతోపాటు ప్రజల్లో నేరాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆపరేషన్‌లో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్ల కోటేశ్వర్, కె.సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, పి.శ్రీలత, ఎస్సైలు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రుడికి ఆర్థిక చేయూత...
ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపుతో విరాళాల వెల్లువ

కరీంనగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన మార మహేశ్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 453వ ర్యాంకు, ఎస్సీ విభాగంలో 17వ ర్యాంకు సాధించి, తిరుచిరాపల్లి నిట్‌లో సీటు పొందాడు. అతడి చదువుకు పేదరికం అడ్డుగా నిలిచింది. అతడి ఐదేళ్ల చదువుకు ఎనిమిది లక్షల రూపాయల ఫీజు, మరో 15 వేలు రిజిస్ట్రేషన్ కోసం అవసరం.. మహేశ్ తండ్రి వ్యవసాయ కూలీ. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. లక్షల రూపాయలు వెచ్చించి మహేశ్‌ను చదివించలేని పరిస్థితి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక, రాజీ పడి వేరే కోర్సు చేయలేక మహేశ్ తల్లడిల్లాడు. ఈ విషయం కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసింది. ఆయన మహేశ్ చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మానకొండూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు 3.22 లక్షల రూపాయల విరాళాలు పోగు చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం ఎల్ఎండీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థి మహేశ్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన మహేశ్ నిట్‌లో జాతీయ ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. చదువులో రాణించే మహేశ్‌లాంటి నిరుపేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహేశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని పిలుపు ఇవ్వగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉన్నతాధికారులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. మహేశ్‌కు విరాళాలు ఇచ్చిన వారందరిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమం అనంతరం మహేశ్‌ను వెంటబెట్టుకుని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ వద్దకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సదరు విద్యార్థికి వ్యక్తిగత సాయం అందించారు.



మహేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ఎస్సారెస్పీకి 'మహా' వరద
ప్రాజెక్టులోకి 75,648 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి రాత్రి 12 గంటల వరకు 75,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి సుమారు 50 వేలు క్యూసెక్కుల పైచిలుకు నీరు డ్యామ్‌లోకి వచ్చి చేరుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 31.366 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుం చి 638 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఒక్క రోజు వ్యవధిలోనే ప్రాజెక్టులోకి 9 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీజన్‌లో తొలిసారి 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటి..

ప్రస్తుత సంవత్సరం వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు గరిష్ఠంగా 9వేల క్యూసెక్కుల లోపు ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో 65 వేలకు పైగా క్యూసెక్కులు దాటడం ఇదే తొలిసారి. వారం రోజుల పాటు ఇన్‌ఫ్లో ఇదేవిధంగా కొనసాగితే ప్రాజెక్టు నిండుకుండలా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వేములవాడలో శ్రావణ సందడి
రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు




వేములవాడలో భక్తుల రద్దీ, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

వేములవాడ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి కోడెమొక్కు క్యూలైన్‌లో నిరీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. పరివారం దేవాతాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణ పూజకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్, అశోక్ ఆధ్వర్యంలో సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర నిత్యాన్నదాన సత్రానికి నిజామాబాద్ పట్టణానికి చెందిన మమత- రాజేందర్ దంపతులు రూ. ఒక లక్ష విరాళం అందజేశారు. తమ కూతురు రష్మిక పేరుతో ఆలయ నిత్యాన్నదాన సత్రానికి చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్ కుమార్‌కు అందజేశారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. సా యంత్రం 6.05 గంటల నుంచి ఆలయ కల్యాణ మంటపంలో మహా లింగార్చన వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ సందడి నెలకొంది. లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శివ లింగానికి పంచా మృతాలతో అభిషేకాలు చేసి శివుడికి బిల్వపత్రిని సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్: కోటిలింగాలలో భక్తులు పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు భక్తులచే పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు.



కల్యాణ పూజకు హాజరైన భక్తులు

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం జిల్లా కార్యదర్శి గుర జాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ మధాహ్న భోజన రంగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తరలివచ్చిన కార్మికులుతో ధర్నాచేసి కలెక్టరేట్ ఏవోరాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పెండింగ్‌లో ఉన్న ఐదునెలల వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల నిర్వహణ ఈకుబేర్ నుంచి మినహాయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అవసరమైన గ్యాస్‌సిలిండర్‌లను ప్రతి పాఠశాలకు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి రూ. 10వేల వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. నగదు బదిలీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు బలమణి, మ్యాకల కవిత, గడప సంధ్య, మెరుగు బాబాయ్, రెడ్డిమల్ల లక్ష్మీ, కర్మ సంధ్య పాల్గొన్నారు.

నేడు పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రారంభం
ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



తంగళ్లపల్లి, జులై 28 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్లలో జాతీయ స్థాయి విద్యా సంస్థ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రస్తుత రవాణా శాఖ మంత్రి, అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ చొరవతో 2013 కేంద్రీయ విద్యాలయం కోసం కృషి చేయగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లలో 2015లో మంజూరైంది. అప్పటి నుంచి సిరిసిల్లలో ఇరుకు గదుల్లో కొనసాగుతుండగా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో కేంద్రీయ విద్యాలయం కోసం స్వంత భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి మంగళవారం ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. కేంద్ర స్వతంత్ర ఇన్‌చార్జి మంత్రి జయంత్ చౌదరి పాల్గొననున్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల వాడకం తగ్గేనా?
హోటళ్లు, దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం



జమ్మికుంట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ అధికారులు తరుచూ ప్లాస్టిక్ నిషేధం అమలుపై పర్యవేక్షిస్తున్నా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. దుకాణదారుల వద్ద దొరికిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు సైతం విధించారు. ఈ క్రమంలోనే దుకాణదారులకి ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, పేపర్ బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. ఇది ఎక్కడా ఆచరణలో సాధ్యం కావడం లేదు. గతంలో షాపుల ఎదుట పెట్టి అమ్మకాలు జరిపే దుకాణాదారులు ప్రస్తుతం చాటు మాటుగా కౌంటర్ల లోపల పెట్టి ఇస్తున్నారు. పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన 40 మైక్రాన్ల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించినా అమలుకు నోచుకోవడం లేదు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడొద్దు..

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారపదార్థాలను తీసుకెళ్లడం వల్ల ఆ కవర్లలో ఉండే భారలోహాలు కరిగి ఆహారంలో చేరి విషపూరితంగా మారుతాయి. ముఖ్యంగా టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు పార్శిళ్లు తీసుకెళ్లేవారికి వేడి వేడి ఆహార పదార్థాలను కవర్లలో ప్యాక్ చేసి ఇస్తుంటారు. ఇలాంటి ఆహార పదార్థాలతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా వేడి సాంబారును, వేడి టీని కవర్లలో తీసుకెళ్లడం చేయకూడదు. కొన్ని సందర్భాల్లో కవర్లలో ఇంటికి తీసుకెళ్లిన ఆహార పదార్థాలు తిన్న తర్వాత ఆ కవర్లను చెత్త కుండిలో వేస్తుంటారు. వాటిని మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.

పర్యావరణానికి తీవ్ర హాని..

వేల సంవత్సరాల వరకు మట్టిలో కలవని గుణం కారణంగా ఇవి భూమి పైపొరల్లో పేరుకుపోయి వర్షం పడినపుడు నీటిని భూమిలో ఇంకకుండా అడ్డుకుంటాయి. దీనివల్ల భూగర్భ జలశాతం కూడా తగ్గిపోతుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ముంపు ఏర్పడుతోంది. అంతేకాకుండా వీటిని కాల్చినపుడు విష వాయువులు పెద్దఎత్తున గాలిలోకి వెలువడుతున్నాయి. కాబట్టి వీలైనంత వరకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా రోడ్లు.. రాకపోకలకు పాట్లు

- మట్టిరోడ్డుతో మైలారం, సాంబయపల్లి గ్రామస్థుల అవస్థలు
- రాజాపూర్, కాచాపూర్ మధ్య నిలిచిన ఆర్టీసీ సేవలు



కన్నాపూర్-రాజాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు

గన్నేరువరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం, సాంబయపల్లి రెండు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి నేటికీ మట్టిరోడ్డే దిక్కు. ప్రస్తుతం వర్షాలు పడడంతో మట్టి రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. మైలారం-గన్నేరువరం మధ్యలో ఉన్న కల్వర్టుపై వరదనీరు ప్రవహించడంతో కల్వర్టు దాటే పరిస్థితి లేదు. దీంతో ఖాసింపేట రోడ్డు గుండా మరో 4కిలోమీటర్ల దూరం ప్రయాణించి గన్నేరువరం చేరుకునే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి మైలారం వరకు అక్కడి నుంచి ఖాసింపేట మీదుగా వద్లూరు బేగంపేట వరకు డబుల్ రోడ్డును నిర్మించేందుకు గతేడాది ఆగస్టులో సీఆర్ఐఎఫ్ కింద కేంద్రప్రభుత్వం నుంచి 32కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. రోడ్డు నిర్మాణానికి మండల కేంద్రంలో గతేడాది ఆగస్టు 30న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఏడాది గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొంతమేరకు రోడ్డు వెడల్పు చేసి రోడ్డుకు రెండువైపులా మట్టిని పోశారు. ఇటీవల కురుస్తున్న భారీవర్షాలకు మట్టి రోడ్డు మొత్తం బురదగా మారి దారి నరకప్రాయంగా మారింది. మండలకేంద్రానికి చేరుకోవడానికి వాహనదా రులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తారు రోడ్డు నిర్మించాలని మైలారం, సాంబయపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు సేవలు

శంకరపట్నం: శంకరపట్నం మండల పరిధిలోని పలు గ్రామాలు మండల కేంద్రానికి వెళ్లే ప్రధానరోడ్లను కలిపే గ్రామీణరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని సంవత్స రాల క్రితం వేసిన బీటీరోడ్లు ధ్వంసం కావడంతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని కన్నాపూర్, రాజాపూర్, కాచాపూర్ గ్రామాల మధ్య బీటీరోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాజాపూర్, కాచాపూర్ గ్రామాలకు బస్సు రాకపోకలు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవతీసుకొని రోడ్డు మరమ్మతు చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గన్నేరువరం-మైలారం రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

● ఫటాఫట్

వర్షాల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- వైదేహి, మండల వ్యవసాయాధికారి, సైదాపూర్



ఆంధ్రజ్యోతి: వరిలో ఎలాంటి జాగ్రత్తలు తీసు కోవాలి?

అధికారి: భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో రైతులు తమ పొలం నుంచి మురుగు నీటిని త్వరగా తీసివేయాలి

ఆంధ్రజ్యోతి: పత్తిలో ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి?

అధికారి: వర్షాల వలన పత్తిలో వడతెగులు తేలికగా ఆశిస్తుంది. దీని నివారణకు వడ తెగులు సోకిన మొక్కల మొదళ్ల దగ్గర 3గ్రాముల కాపర్-ఆక్సీ-క్లోరైడ్ మందును లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పోయాలి.

ఆంధ్రజ్యోతి: పంటత్వరగా కోలుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

అధికారి: పంట త్వరగా కోలుకోవడానికి నీటిలో కరిగే ఎరువులైన మల్టీకె ఒక కిలో ఎకరానికి లేదా 500ఎంఎల్ నానో యూరియా ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

- సైదాపూర్(ఆంధ్రజ్యోతి)

సుజనాదేవి కథకు బహుమతి

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముల్కనూరు ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో కరీంనగర్‌లోని ఎల్ఐసీ కార్యాలయంలో పనిచేస్తున్న రచయిత్రి నామని సుజనాదేవి రచించిన 'క(ఖ)ర్మయోగి' కథకు తృతీయ బహుమతి దక్కింది. ఆదివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గాయకుడు, రచయిత అందెశ్రీ, మాజీ ఎంఎల్‌ఏ అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ పురస్కారం అందజేశారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో సోమవారం ఉదయం కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా గంజాయి పట్టుబడినట్లు తెలిసింది. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పట్టివేతకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు ఇంకా వెల్లడించలేదు.

ఆలయ అభివృద్ధికి ముందుకురావాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

భగత్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. 42శాతం బీసీ రిజర్వే షన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కొత్తపల్లి మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగేళ్ల బీమా

కరీంనగర్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటు నందిస్తోంది. ఇప్పటికే మహిళలు కోటీశ్వరులను చేసే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వర్తించే బీమా సౌకర్యాన్ని ఏడాది నుంచి నాలుగేళ్ల(2029)వరకు పొడిగించింది. కరీంనగర్ రూరల్ మండలంలో 32 గ్రామైక్య సంఘాలు, 898 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 9, 979మంది సభ్యులు ఉన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకొని ప్రమాదవశాత్తు లేదా సాధారణంగా మరణిస్తే రుణం మాఫీ అవుతుంది. ఈ పథకం కింద కరీంనగర్ రూరల్ మండలంలో ఈ ఏడాది ఐదుగురు లబ్ధిదారులకు సంబంధించి రూ.5లక్షల 34వేల వరకు లబ్ధి చేకూరినట్లు ఏపీఎం భార్గవ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్యారడైజ్ విద్యార్థి



అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు రేకుర్తిలోని ప్యారడైజ్ పాఠశాల విద్యార్థి బి.అవంత్ నాయక్ ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూడో సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభచాటినట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగల్భాలతోనే బీఆర్ఎస్ పాలన



ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ప్రగల్భాలు, ఆర్భాటాలతోనే సాగించిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో సదాశివ పల్లికిచెందిన 12మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్‌పత్రాలను అందజే శారు. మానకొండూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, 7వ డివిజన్ అధ్యక్షుడు బండి మల్లేశం, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ వదిలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్,జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)కరీంనగర్‌లోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌వారు సంయుక్తంగా బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాలలోని ఆడిటోరియంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి తెలిపారు. మహిళా అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని, వివరాలకు జి.రాజశేఖర్‌ను 9912093500 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పారమితలో లీడర్ల ఎన్నిక

భగత్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో సోమవారం వివిధ విభాగాల లీడర్లను, డిప్యూటీ లీడర్లను ఎన్నుకున్నారు. పాఠశాల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, టీఎస్‌వీ రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, కో-ఆర్డినేటర్లు నాగరాజు, రాము పాల్గొన్నారు.

అవగాహనతోనే కాలేయ వ్యాధులు దూరం

సుభాష్‌నగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): హెపటైటీస్‌పై అవగాహన కలిగిఉంటేనే కాలేయ వ్యాధులు దూరం అవుతాయని మెడికవర్ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ దిలీప్‌రెడ్డి అన్నారు. సోమవారం వరల్డ్ హెపటైటీస్ డే సందర్భంగా స్థానిక వాగేశ్వరి డిగ్రీ కాలేజీలో హెపటైటీస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటీస్‌కు టీకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతీ ఒక్కరు టీకాలు వేసుకోవాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, వాగేశ్వరి కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, వైస్‌ప్రిన్సిపాల్ రమణ, చైతన్య, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో సీఎస్‌కేఐ క్రీడాకారులకు గ్రాండ్ చాంపియన్ షిప్



ట్రోఫీలతో సీఎస్‌కేఐ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో ఈ నెల 27న డైనమిక్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్‌కు చెందిన సీఎస్‌కేఐ అకాడమీ క్రీడాకారులు నాలుగు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లతోపాటు పలు పతకాలను సాధించారు. అకాడమీకి చెందిన ఐదుగురు క్రీడాకారులు మొత్తం ఎనిమిది పతకాలతోపాటు గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను సాధించారని సీఎస్‌కేఐ చీఫ్ శ్రీనివాస్ తెలిపారు. 18 సంవత్సరాల బాలుర విభాగంలో డి.రిషికేశ్వర్, 14 సంవత్సరాల విభాగంలో వై.విశ్వక్సేన్, 15 సంవత్సరాల విభాగంలో పవన్‌రాజ్, అండర్-14 సంవత్సరాల విభాగంలో యశోవర్ధన్ గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు చెప్పారు. క్రీడాకారులను సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు పెద్ది సందీప్, సభ్యుడుప్రసన్న కృష్ణ అభినందించారు.

జర్నలిస్టుపై నిషేధం నిరంకుశ చర్య

కరీంనగర్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కాయిత బాలుపై భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్-163 విధించి నెలరోజులపాటు ప్రకటనలు చేయరాదని సిరిసిల్ల తహసీల్దార్ నిషేధం విధించడం నిరంకుశ చర్యగా భావిస్తున్నానని టీయూడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది జర్నలిస్టు భావప్రకటన స్వేచ్ఛను కాలరాయడమేనని పేర్కొన్నారు. బాలుపై విధించిన 163 సెక్షన్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు.

హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శికి సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రీత్‌పాల్‌సింగ్ సలూజను జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు. ఇటీవల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌తో కలిసి సన్మానించారు. ప్రీత్‌పాల్ సింగ్ సలూజను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, పెటాటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, బాధ్యులు అభినందించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కరీంనగర్ రూరల్ 28, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ (టీపీయూఎస్) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్; దుర్శేడ్, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, చామనపల్లి, గుంటూరుపల్లి, బొమ్మకల్, చెర్లబూత్కూర్ పాఠశాలల్లో జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు అయిలవేని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి అలూరి శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'శిలాఫలకం' పుస్తకానికి సినారె పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య సాహితీ గౌతమి అందజేసే సినారె రాష్ట్ర స్థాయి పురస్కారానికి 2022 సంవత్సరానికి దేవనపల్లి వీణావాణి రాసిన 'శిలాఫలకం' పుస్తకం ఎంపికైనట్లు పురస్కార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పురస్కారాన్ని అందజేస్తామని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన వీణావాణి అటవీశాఖలో పని చేస్తున్నారన్నారు.

ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

భగత్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ తెలిపారు. సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ముదిగొండ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, భూతం సారంగపాణి, వడ్ల రాజు, కవ్వంపల్లి అజయ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



శివలింగానికి విశేష అలంకరణ

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ పూజలు జరిపి అర్చనలు చేయించుకున్నారు. ఆలయాల్లో అభిషేక పూజలు చేశారు.

పాఠశాలను పరిశీలించిన కమిషనర్

కరీంనగర్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోయవాడ ప్రభుత్వ పాఠశాలను సోమవరం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం పరిశీలించారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో పాఠశాలలో అభివృద్ధి చేసిన క్లాస్ రూంను తనిఖీ చేశారు. ఆధునాతన టెక్నాలజీ బోధనను పరిశీలించారు. డీఈ లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆండాళ్ తిరునక్షత్రం



విశేషాలంకరణలో గోదాదేవి

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆండాళ్‌దేవి తిరునక్షత్రాన్ని (జన్మదినం) సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వైష్ణవాలయాలు, ఆండాళ్ భవనం, వేదభవనం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● సంక్షిప్తంగా..

సుభాష్‌నగర్: నిబంధనలు పాటించని సంతాన సాఫల్య కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి మురళి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

భగత్‌నగర్: కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 272 సర్వే నంబరులో రిజిస్ట్రేషన్లన్నీ రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కరీంనగర్ కల్చరల్: వాసవి వృద్ధాశ్రమ నూతన అధ్యక్ష కార్యద ర్శులుగా సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం ఎన్నికైన సందర్భంగా విద్యానగర్ శ్రీవాసవిమాత ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం సభ్యులు సన్మానించారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిగురుమామిడికి చెందిన పూర్వవిద్యార్థి కొండయ్య సోమవారం విద్యార్థులకు 15వేల విలువైన సామగ్రి అందజేశారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వరల్డ్ హెపటైటిస్ డే నిర్వహించారు.

గణేశ్‌నగర్: ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహంచారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో లియాపీ హుజూరాబాద్ డివిజన్ ఎల్‌ఐసీ ఏజెంట్ల ఎన్నికల్లో గెలుపొందిన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

హుజూరాబాద్: హుజూరాబాద్, జమ్మికుంట ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల వద్ద పరీక్షల పేరుతో దోపిడీ చేస్తున్నా డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కుమార్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

తిమ్మాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బండి సంజయ్



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తుంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తొండి మాటలు మాట్లాడుతున్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ముస్లింలపై విమర్శలు, వారి ప్రస్తావన లేనిదే బండి సంజయ్‌కి పూటగడవదని విమర్శించారు. కేవలం 1, 2 శాతం పేద ముస్లింలే బీసీల్లో ఉన్నారని, వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని కేంద్రమంత్రి ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.


ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



వైశ్యభవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సమతుల్యత కోల్పోవడంతో అనేక విపత్తులు సంభవిస్తున్నాయని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం వైశ్య భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలోని పలు దేశాల్లో అతివృష్టితో జల ప్రళయాలు, భూకంపాలు, సునామీలు ఏర్పడుతున్నాయన్నారు. వాసవి వృద్ధాశ్రమం అధ్యక్షుడు సామ నారాయణ, జిల్లా అవోపా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం, గంజి స్వరాజ్‌బాబు, పాత వెంకటనరసయ్య, కన్న కృష్ణ, తొడుపునూరి దశరథం, ఏవీఎం మధు, కైలాస నవీన్, పెద్ది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గణేశ్‌నగర్,జూలై 28 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని భవన నిర్మాణ ఆల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ తోట రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, క్లెయిమ్‌లలో ప్రభుత్వం థర్డ్ పార్టీ ఏజెన్సీలను నియమించడాన్ని యూనియన్ వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సంఘటితం చేయడం కోసం స్టేట్ కో ఆర్డినేషన్ కమిటీ ఎన్నుకొని జిల్లా కమిటీ ద్వారా ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా కమిటీ భవననిర్మాణ కార్మిక ఉద్యమ ప్రారంభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

తిమ్మాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పరిపాలన వైఫల్యాలను గడపగడపకూ చేరేవిధంగా ప్రచారం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ మండలఅధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వ రాచారి, రాష్ట్ర నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపెల్లి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు తిరుపతి, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు రతన్ కుమార్, అనిల్‌కుమార్, అంజన్‌కుమార్, కరుణాకర్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

రామడుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ గోపాల్‌తో కలిసి రామడుగు, గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా చేయాలన్నారు. వైద్యాధికారులు గ్రీష్మన్య, పవన్‌కుమార్, డాక్టర్ సాయిరాజ్, తదితరులున్నారు.

వృద్ధులు, వికలాంగుల ఆశ్రమం పరిశీలన

కరీంనగర్ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ పట్టణంలోని ప్రభుత్వ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమం, స్వాదార్ హోమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆహార పదార్థాలను నిలువచేసే గదులను తనిఖీ చేశారు. వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంతో స్వాదార్‌హోమ్‌లో పండ్లు పంపిణీ చేశారు.

జూడో క్రీడాకారిణికి సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అండర్-17 జూడో క్రీడల్లో స్వర్ణం సాధించిన జిల్లాకు చెందిన గాజుల సహస్రను మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు సోమవారం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత రాణించాలని, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకు రావాలని అన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలి

చొప్పదండి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని 108ఉమ్మడి కరీం నగర్ జిల్లాప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అన్నారు. సోమవారం చొప్పదండిలో 108 అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. చొప్పదండిలో పైలెట్లుగా పనిచేస్తున్న దీకొండ సుధాకర్, ఎనగందుల శ్రీనివాస్‌ను స్టార్‌పైలెట్లుగా గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ గుర్తించడం అభినందనీయమన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంఈవో

చొప్పదండి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలను ఎంఈవో పి మోహన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదిలోని కూరగాయలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. గురు కులంలో అందిస్తున్న భోజనం తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

తప్పుడు పోస్టులపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్, బీజేపీ నాయకుడు వై.సునీల్‌రావుపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినట్లు వచ్చిన ఫిర్యాదుపై కరీంనగర్ టూటౌన్ పోలీసులు బీఆర్ఎస్‌కు చెందిన నవాజ్‌హుస్సేన్, కాంగ్రెస్‌కు చెందిన ఆకుల ఉదయ్‌పై కేసు నమోదు చేశారు. వారం రోజులుగా సునీల్‌రావుపై కొందరు సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలను పోస్ట్ చేస్తున్నారని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హుజూరాబాద్‌రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎంఈవో భూపతి శ్రీనివాస్ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు.